# ఈ-నామ్ విధానానికి వ్యతిరేకంగా నిమ్మ రైతాంగం ఆందోళన

**ఈ-నామ్** పద్ధతిలో మార్కెట్‌యార్డుల్లో పంటల కొనుగోళ్ళు చేయవద్దని తెనాలి మార్కెట్ యార్డులో రైతాంగ ఆందోళన ఉధృతరూపం దాల్చింది. యార్డులో కార్యక్రమాలు స్థంభించాయి.

తెనాలి డివిజన్‌లో అనేక ప్రాంతాల్లో నిమ్మ పంట సాగులో వుంది. కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల్లోనూ, తెనాలి మండలంలోని అంగలకుదురు, సంగం జాగర్లమూడి, పరిసర ప్రాంతాల్లో నిమ్మపంటను రైతాంగం విస్తారంగా పండిస్తున్నారు. నిమ్మ వ్యాపారంలో తెనాలి మార్కెట్‌కి ఎంతో ప్రాధాన్యత వుంది. ఇక్కడినుండి అనేక ప్రాంతాలకు నిమ్మకాయల ఎగుమతి జరుగుతూ వుంటుంది. నిమ్మకాయల గ్రేడింగ్‌లో నాసిగా వున్న వాటిని స్థానికంగా చిరు వ్యాపారులు కొనుగోలు చేసి, వాటి అమ్మకాల ద్వారా జీవనం సాగిస్తున్నారు.

పంటల కొనుగోళ్ళు ఈ-నామ్ పద్ధతిలో జరపాలనే ప్రభుత్వ ఆదేశంలో భాగంగా 9-10-17 నుండి తెనాలి మార్కెట్ యార్డులో ఈ పద్ధతిలోనే కొనుగోళ్ళు జరుగుతాయని అధికారులు ప్రకటించారు. అనేక మార్కెట్‌యార్డుల్లో ఈ-నామ్ కొనుగోళ్ళు నష్టదాయకంగా వుండటం, గుంటూరు, దుగ్గిరాల మార్కెట్ యార్డుల్లో 32 రోజులుగా మిర్చి, పసుపు కొనుగోళ్ళు ఆగిపోవటంతో నిమ్మరైతులు ఈ-నామ్ కొనుగోళ్ళను వ్యతిరేకించి పాతపద్ధతిని (వ్యాపారి, రైతు పరస్పరం అంగీకారం)లోనే కొనుగోళ్ళు జరగాలని కోరారు. రైతుల విన్నపాలను తిరస్కరిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఈ-నామ్ పద్ధతిలోనే కొనుగోళ్ళు జరుగుతాయని యార్డు అధికారులు చెప్పటంతో, దాన్ని వ్యతిరేకిస్తూ 9-10-17న పెద్దసంఖ్యలో రైతాంగం ఈ-నామ్ వద్దు పాత పద్ధతే కావాలంటూ యార్డు వద్దకు వచ్చారు. రైతుల నినాదాలతో యార్డు ప్రాంగణం మారుమోగింది. ఆగ్రహంతోనున్న రైతాంగం గుంటూరు-తెనాలి రహదారిపై చేరుకొని అక్కడే బైఠాయించారు. రోడ్డుకు అడ్డంగా కొందరు పడుకొన్నారు. పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. పోలీసు అధికారులు రంగప్రవేశం చేసి రైతాంగంతో మాట్లాడి రాకపోకలకు సహకరించాలని కోరినా రైతాంగం దాన్ని తిరస్కరించారు. పోలీసులకు - రైతాంగం మధ్య వాగ్వివాదం తీవ్రస్థాయిలో జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో, మార్కెట్ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శి ఉన్నతాధికారులను ఫోన్‌లో సంప్రదించి, యార్డు దగ్గర ఉద్రిక్త పరిస్థితిని వివరించగా, తాత్కాలికంగా రెండు రోజులు ఈ-నామ్ విధానాన్ని నిలిపివేయటానికి ఉన్నతాధికారులు అనుమతించారు. ఆ విషయాన్ని రైతులకు చెప్పటంతో, రైతాంగం ఆందోళన విరమించారు.

మార్కెట్‌యార్డుల్లో అమ్మకం కోసం రైతులు తెచ్చిన పంటలను గుట్టలుగా పోసి లాట్ పద్ధతిద్వారా సరుకు నాణ్యతను అంచనా వేసి ఎంతధర పలుకుతుందో రైతాంగానికి తెలియజేస్తారు. దేశంలో ఎక్కడ ఏ ఏ పంట ఉత్పత్తులు లభిస్తాయి, నాణ్యమైన ఉత్పత్తులు ఏ మార్కెట్ యార్డుల్లో లభిస్తాయన్నది ఈ-నామ్ ద్వారా పొందు పరుస్తారు. దేశంలోని ఏ ప్రాంతంలోని మార్కెట్ యార్డుల్లోనైనా వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా పంటలకు “కొటేషన్” పద్ధతిలో కొనుగోలు ధరను ప్రకటిస్తారు. ఈ విధంగా ఏ వ్యాపారి అయినా ఆ పంట కొనుగోలుకు ‘కొటేషన్’ వేయవచ్చు. ఈ విధానం ద్వారా దేశ వ్యాపితంగా ఏకీకృత మార్కెట్ వ్యవస్థ ఏర్పడి రైతాంగం పంటలకు మంచిధర లభిస్తుందని మోడి ప్రభుత్వం మభ్యపెడుతున్నది. పంట కొనుగోలు చేసిన 24 గంటల్లో ఆన్‌లైన్ చెల్లింపులు జరుగుతాయని చెబుతున్నది.

ఈ-నామ్ కొనుగోలు విధానం ద్వారా పంటల ధరలను, కొనుగోళ్ళను బడా వ్యాపారుల, బడా వ్యవసాయ వాణిజ్య కంపెనీల చేతుల్లోపెట్టి కొనుగోళ్ళనుండి పూర్తిగా ప్రభుత్వం తప్పుకోనున్నది. బడావ్యాపారుల పోటీకి తట్టుకొనే ఆర్థికస్తోమత లేక స్థానికంగా ఉన్న వ్యాపారులు కొనుగోళ్ళ నుండి తప్పుకోవాల్సి వస్తుంది. బడా వ్యాపార వర్గం కూటమిగా ఏర్పడి పంటల కొనుగోళ్ళలో పోటీ లేకుండా వ్యవహరిస్తారు. రైతాంగానికి అనుకూలమైన ధర లభించదు. తన పంటను మార్కెట్ యార్డుకి తెచ్చిన తర్వాత వ్యాపారి వేసిన ‘కొటేషన్’ ధరకు అమ్మటానికి రైతు నిరాకరిస్తే, ఆ తర్వాత పంట అమ్ముకోవటం రైతుకి కష్టమైపోతుంది. అంతకన్నా తక్కువ ధరకే అమ్ముకోవాలి. పచ్చి పంటలైన నిమ్మ, టమాటా, కూరగాయలు, పండ్ల పంటల రైతులు మరింతగా నష్టపోతారు. నిల్వచేయటం సమస్యగా మారి వ్యాపారి చెప్పిన ధరకే అమ్మక తప్పదు.

ఈ-నామ్ విధానం వద్దంటూ రైతాంగం ఆందోళన చేస్తుంటే, రైతులకు, వ్యాపారులకు, కమీషన్ ఏజంట్లకు నష్టంలేకుండా అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని వారితో జరిపిన సమావేశంలో తెనాలి ఎం.ఎల్.ఏ. చెప్పటం, అర్థంలేనిది. పెద్దనోట్ల రద్దువలన నష్టపోయామని, మరలా ఈ-నామ్ విధానంవలన నష్టపోయే ప్రమాదం వుందని రైతులు పేర్కొంటున్నారు.

ఈ-నామ్ విధానాన్ని రెండురోజులు వాయిదా వేసిన అధికారులు, మార్కెటింగ్ కమీషనర్ ఆదేశాలతో, తిరిగి ఆన్‌లైన్ బిడ్డింగ్ విధానాన్ని అమలుచేయటానికి ప్రయత్నించగా రైతాంగం దాన్ని వ్యతిరేకిస్తూ రోడ్డుపై బైఠాయించారు. పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. సమస్య ఎడల స్పష్టమైన వివరణ ఎంతకీ రాకపోవటంతో రైతులందరూ ఒక్కసారిగా మార్కెట్ కార్యాలయంలోకి దూసుకెళ్ళారు. తమ ఆగ్రహాన్ని కుర్చీలు, టేబుళ్ళపై ప్రదర్శించారు. అడ్డువచ్చిన సెక్యూరిటీ సిబ్బందిని నెట్టివేశారు. అధికారుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి వచ్చారు. రైతాంగం ఆందోళన సాకును జూపి వివిధ కారణాలతో కొనుగోళ్ళను వాయిదా వేశారు. రైతుల ఆందోళన కొనసాగుతోంది.

oooo